4 సిట్టింగ్‌లకే..

బీఆర్‌ఎస్ అభ్యర్థుల జాబితా వెల్లడి

- ఉప్పల్‌లో మాత్రం బండారి లక్ష్మారెడ్డి ఖరారు
- ఆశావహులకు తప్పని భంగపాటు.. పక్కచూపులు చూస్తున్న నేతలు
- తనయుడు జెడ్పీ చైర్మన్ కావడంతో.. డైలమాలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి
- మేడ్చల్ టికెట్‌పై హామీ ఇస్తే కాంగ్రెస్‌కు మారే అవకాశం..!
- వ్యతిరేక చర్యలకు పాల్పడితే వేటు తప్పదని అధినేత హెచ్చరిక



సాక్షి, మేడ్చల్ జిల్లా: అధికార బీఆర్‌ఎస్ ముందస్తుగా అభ్యర్థుల జాబితాను సోమవారం ప్రకటించింది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొత్తంగా ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, వచ్చే ఎన్నికల్లో పోటీకి ఉప్పల్ సెగ్మెంట్ మినహాయించి మిగతా మేడ్చల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో మళ్లీ సిట్టింగ్ ఎమ్మెల్యేలకే అవకాశం కల్పించారు. దీంతో మరో రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూడా అభ్యర్థులను మార్చనున్నారనే రాజకీయ వర్గాల ఊహాగానాలకు తెరపడినట్లయింది. అధిష్టానం ప్రకటించిన ఎమ్మెల్యే అభ్యర్థుల్లో నలుగురు ఓసీ సామాజిక వర్గానికి చెందిన వారు కాగా, ఒకరు మాత్రమే బీసీ సామాజిక వర్గానికి చెందిన వారు ఉండటం విశేషం. ఇదిలా ఉంటే గతకొంత కాలంగా ఎమ్మెల్యే టికెట్‌పై ఆశలు పెంచుకున్న మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, నవీన్‌రావు, మాజీ మేయరు బొంతు రామ్మోహన్ ఆశావహులకు ఈ సారి కూడా నిరాశే మిగిలింది. మళ్లీ టికెట్ లభించగలదని ఆశ పడిన ఉప్పల్ సిట్టింగ్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డికి అధిష్టానం మొండి చెయ్యి చూపింది. తండ్రుల స్థానంలో తనయులు చామకూర మహేందర్‌రెడ్డి, మైనంపల్లి రోహిత్‌లు పోటీ చేయాలని భావించినా భంగపాటు తప్పలేదు.

ఆశావహులకు భంగపాటు

మేడ్చల్ నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి టికెట్ ఆశించినా భంగపాటు తప్పలేదు. గత ఏప్రిల్ మాసంలో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించిన సందర్భంలో సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అధినేతల సమక్షంలోనే వాగ్వాదాలు, తోపులాటలకు దిగిన విషయం తెలిసిందే.. మేడ్చల్ నుంచి మళ్లీ బీఆర్‌ఎస్ అభ్యర్థిని తానేనని పలు ఆత్మీయ సమ్మేళనాల్లో ప్రకటించటంతోపాటు మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో సహా ఆయన తనయుడు జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి ఆహ్వానించకపోవడం వంటి విషయాల నేపథ్యంలో ఇరువురి మధ్య విభేదాలు పొడచూపినట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగింది.

పార్టీ వ్యతిరేక విధానాలకు..

బీఆర్‌ఎస్ అభ్యర్థులను ప్రకటించిన అధిష్టానం.. జిల్లాతో సహా నియోజకవర్గాల్లో నాయకులు, కేడర్ అంతా కలిసికట్టుగా పనిచేయాలని ఆదేశించింది. అలా కాకుండా.. పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడితే వారు ఎంతటి వారైనా సరే ఉపేక్షించే ప్రసక్తే లేదని ఆ పార్టీ అధినేత కేసీఆర్ హెచ్చరించడం వంటి విషయాలు కూడా పార్టీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశం అవుతున్నాయి.

ఏ నియోజకవర్గంలో ఎవరంటే..?

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, ఇందులో నాలుగింటిలో మళ్లీ సిట్టింగ్ ఎమ్మెల్యేలకే అధిష్టానం అవకాశం కల్పించింది. సిట్టింగ్ స్థానాలైన మేడ్చల్ నియోజకవర్గం నుంచి మంత్రి చామకూర మల్లారెడ్డి, కుత్బుల్లాపూర్ నుంచి కేపీ వివేకానందగౌడ్, కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి మాధవరం కృష్ణారావు, మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి మైనంపల్లి హన్మంతరావును బీఆర్‌ఎస్ అభ్యర్థులుగా అధిష్టానం ప్రకటించింది. ఉప్పల్ నియోజకవర్గంలో మాత్రం బండారి లక్ష్మారెడ్డినికి అభ్యర్థిగా ఖరారు చేసింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన బండారి లక్ష్మారెడ్డికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారన్న చర్చ ఆయన అనుచర వర్గాల నుంచి వ్యక్తమవుతోంది. జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో మళ్లీ సిట్టింగ్ అభ్యర్థులకే టికెట్లు ప్రకటించి, అందరినీ ఆశ్చర్యంలో ముంచేశారు. ఎన్నికలకు మరో మూడు మాసాల గడువు ఉండగా, అభ్యర్థులను ప్రకటించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

మిగతా నియోజకవర్గాల్లోనూ..

కుత్బుల్లాపూర్ నుంచి ఎమ్మెల్సీ, జిల్లా పార్టీ అధ్యక్షుడు శంభీపూర్ రాజు టికెట్ ఆశించారు. అలాగే, కూకట్‌పల్లి నుంచి మరో ఎమ్మెల్సీ నవీన్‌రావు కూడా టికెట్ ఆశించి భంగపడ్డారు. వీరిలో ఏ ఒక్కరిపై కూడా అధిష్టానం మొగ్గు చూపకపోవడం విశేషం. పార్టీ కోసం కష్టపడి పని చేసినా.. ప్రాధాన్యత ఇవ్వకవడంతో వారంతా అధిష్టానంపై గుర్రుగా ఉన్నారు. అవకాశం కోసం కొందరు పక్క చూపులు చూస్తున్నారు. వీరిలో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి బీఆర్‌ఎస్‌ను వీడే అవకాశం ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. అయితే తనయుడు మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి జెడ్పీ చైర్మన్‌గా కొనసాగుతుండటం వల్ల పార్టీ మారే విషయంపై మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి డైలమాలో ఉన్నట్లు తెలుస్తోంది. పైగా కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ టికెట్ ఇస్తానని హామీ ఇచ్చినట్లయితే కూడా.. బీఆర్‌ఎస్‌ను వీడే అవకాశమున్నట్లు ప్రచారం జరుగుతోంది.

క్లుప్తంగా

కాంగ్రెస్ విజయానికి ప్రణాళికతో ముందుకు సాగుతున్నాం

కుత్బుల్లాపూర్: రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని కొంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు భైరి ప్రశాంత్‌గౌడ్ అన్నారు. సోమవారం మున్సిపాలిటీకి సంబంధించి కాంగ్రెస్ పార్టీ కమిటీని ఆయన ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా కందాడి సుదర్శన్‌రెడ్డి, డప్పు నరేందర్, ప్రధాన కార్యదర్శులుగా ఆదిరెడ్డి సురేందర్‌రెడ్డి, కావలి గోపాల్, ఉపేందర్‌రెడ్డి, దొడ్ల శ్రీనివాస్, కోశాధికారిగా ఎర్రోళ్ల కృష్ణ, కార్యనిర్వాహక సభ్యులుగా భైరి శ్రీవిద్య, బి.సరిత, చంద్రకళ, యతిరాజారావు, దర్శన్ ముదిరాజ్, గోపాల్‌రెడ్డి, రాముగౌడ్, వెంకటేష్‌గౌడ్, దుర్గరాజు, మోహన్‌రెడ్డి, చంద్రనాయక్, నర్సింగ్ నాయక్‌లకు నియమాక ప్రతాలను అందజేశారు.

నిరుపయోగంగా టాయిలెట్లు



జగద్గిరిగుట్ట కొండపై నిరుపయోగంగా పడిపున్న టాయిలెట్లు

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని పలు చోట్ల టాయిలెట్ల నిర్వహణ లోపం కారణంగా నిరుపయోగంగా మారాయి. మూడేళ్ల క్రితం దేవమ్మ బస్తీ, బీరప్పనగర్, మగ్దూంనగర్, జగద్గిరిగుట్ట కొండపై ఇంకా తదితర ప్రాంతాలలో అమర్చిన బయో, మైల్డ్ స్టీల్, ప్రీ ఫ్యాబ్రికేటెడ్ టాయిలెట్లు నిర్వహణ లోపం కారణంగా అందులో ఉన్న పరికరాలను దోచుకెళ్లారు. ఇలా ప్రజాధనం వృథా కాకుండా ఈ టాయిలెట్లను మరమ్మతులు చేసి ఉపయోగంలోకి తేవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

పకడ్బందీగా గృహలక్ష్మి సర్వే



సుభాష్‌నగర్: పేద మధ్యతరగతి వర్గాల సొంతింటి కల కోసం ప్రభుత్వం గృహలక్ష్మి పథకం ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ పథకంపై అర్హులుగా గుర్తించేందుకు అధికారులు దరఖాసుదారుల ఇంటి వద్దకు వెళ్లి సర్వే నిర్వహిస్తున్నారు. కుత్బుల్లాపూర్ తహసీల్దార్ పరిధిలో 325 దరఖాస్తులు రాగా ఆరు బృందాలతో కలిసి ఈ సర్వేను పకడ్బందీగా జరుపుతున్నారు.

టార్గెట్ హ్యాట్రిక్!

- కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా కేపీ వివేకానంద్
- అధిష్టానం వివేకానంద్ పేరు ప్రకటించడంతో గులాబీ శ్రేణుల్లో హర్షం
- బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు



కేపీ వివేకానంద్, ఎమ్మెల్యే కుత్బుల్లాపూర్



బాలయ్యనగర్‌లో నాగేశ్ ఆధ్వర్యంలో సంబురాలు జరుపుతున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు

కుత్బుల్లాపూర్/సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి మూడోసారి బీఆర్‌ఎస్ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా వివేకానంద్‌ను సోమవారం పార్టీ అధిష్టానం ప్రకటించింది. దీంతో బాలయ్యనగర్‌లో బీఆర్‌ఎస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. బీఆర్‌ఎస్ నాయకుడు నాగేష్ ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు.

మొదటి నుంచి రాజకీయాలంటే మక్కువ..

కేఎం పాండు, శ్యామల దంపతులకు కేపీ వివేకానంద్ 21 అక్టోబర్ 1977న జన్మించారు. చింతల్‌లోని హెచ్‌ఎంటీ హైస్కూల్‌లో విద్యనభ్యసించారు. తండ్రి కేఎం పాండు రెండుసార్లు సర్పంచ్‌గా, కుత్బుల్లాపూర్ మున్సిపాలిటీకి మొదటి చైర్మన్‌గా పని చేశారు. రాజకీయ కుటుంబం నేపథ్యంలో వివేకానంద్ మొదటి నుంచి రాజకీయాలంటే మక్కువగా ఉండేది.

మూడోసారి ఎమ్మెల్యేగా పోటీ...

ఉస్మానియా యూనివర్సిటీ నుంచి తన బీటెక్ పూర్తి చేసిన వివేకానంద్ 2000 సంవత్సరంలో క్రియాశీలక రాజకీయాల్లో చేరారు. 2014లో టీడీపీ నుంచి విజయం సాధించారు. అనంతరం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. 2018లో కేపీ వివేకానంద్ బీఆర్‌ఎస్ తరఫున టికెట్ పొంది మరోమారు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఈ దఫా మూడోసారి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న వివేకానంద్ హ్యాట్రిక్ సాధించాలని ఉవ్విళూలూరుతున్నారు.

2014లో ఆదర్శ యువ విధాయక్ పురస్కారం

తెలంగాణ రాష్ట్ర శాసనసభలో నియమాల కమిటీ సభ్యుడిగా వ్యవహరించిన ఆయన యూఎస్ యంగ్ లీడర్స్ పొలిటికల్ ప్రోగ్రామ్‌లో భారతదేశం నుంచి ప్రాతినిధ్యం వహించడానికి తెలంగాణ నుంచి ఎంపికైన ఐదుగురు ఎమ్మెల్యేల్లో వివేకానంద్ ఒకరు. అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఆయనకు పూణెకు చెందిన ఛత్రసాన్సద్ సంస్థ 2014 సంవత్సరానికి గాను ఆదర్శ యువ విధాయక్ పురస్కారంతో సత్కరించింది. నిత్యం కుత్బుల్లాపూర్ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలకు పరిష్కారానికి కృషి చేస్తూ ముచ్చటగా మూడోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించే దిశగా వివేకానంద్ పావులు కదుపుతున్నారు.



సీఎంకు కృతజ్ఞతలు

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా కేపీ వివేకానంద్‌ను ప్రకటించారు. ఈ నేపథ్యంలో సోమవారం తెలంగాణ భవన్‌లో సీఎం కేసీఆర్‌ను ఆయన కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.
– కుత్బుల్లాపూర్

హిందూ దేవాలయాలను కూల్చడం దారుణం

మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్



దేవేందర్‌నగర్‌లో కూల్చిన సుబ్రహ్మణ్యస్వామి ఆలయాన్ని సందర్శించిన కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: ప్రభుత్వ భూముల యథేచ్ఛగా కబ్జాలకు గురవుతున్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారులు హిందూ దేవాలయాలను మాత్రం నోటీసులు సైతం ఇవ్వకుండా కూల్చివేయడం దారుణమని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గాజులరామారంలోని దేవేందర్‌నగర్ సుబ్రమణ్యస్వామి ఆలయంలో సోమవారం రెవెన్యూ అధికారులు కూల్చివేతలు చేపట్టిన విషయాన్ని తెలుకున్న ఆయన ఘటనా స్థలాన్ని సందర్శించారు.

◆ ఈ సందర్భగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. ఆలయానికి ఇరువైపులా ప్రభుత్వ భూములు కబ్జాల పాలైన పట్టించుకోని అధికారులు హిందూ దేవాలయాలపై మాత్రం తీవ్ర వివక్షతను చూపుతున్నారన్నారు. ఎమ్మెల్యే వివేకానంద్ కనుసన్నల్లోనే ఈ కూల్చివేతలు జరిగాయని ఆరోపించారు.

◆ తాను ఎమ్మెల్యేగా ఉన్నపుడు ప్రభుత్వ భూములు కాపాడానని తెలిపారు. ప్రస్తుత ఎమ్మెల్యే అనుచరులే ప్రభుత్వ భూములన్నీ కబ్జాలు చేసి మాయం చేశారన్నారు. ఎమ్మెల్యే తొమ్మిదేళ్లలో చేసిన కబ్జాల చిట్టాను బయటపెడతామన్నారు. త్వరలోనే ప్రభుత్వ భూముల కబ్జాలపై పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామన్నారు. హిందూ ఆలయాల జోలికి వస్తే ఊరుకునేది లేదని అధికారులను హెచ్చరించారు.


◆ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గరిగే శేఖర్ ముదిరాజ్, జిల్లా కార్యదర్శి జగన్ మోహన్‌రావు, డివిజన్ అధ్యక్షులు పున్నారెడ్డి, కంది శ్రీరాములు, రాజేశ్వరరావు దుర్యోధనరావు, డివిజన్ ఇన్‌చార్జ్‌లు మోతే శ్రీనివాస్‌యాదవ్, రాజిరెడ్డి, కృష్ణయాదవ్, బిల్లా వెంకటేష్, నాయకులు రమేష్ మంజుల్కర్, గుమస్తా మధుసూదన్, చిలుక శ్రీనివాస్, యాము తదితరులు పాల్గొన్నారు.



బాలయ్యనగర్‌లో నాగదేవత విగ్రహానికి పాలు పోస్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి పూజలు

నాగుల పంచమి పురస్కరించుకొని సోమవారం కుత్బుల్లాపూర్‌లోని ఆలయాలు కిటకిటలాడాయి. ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు నాగదేవతకు పూజలు చేశారు. మహిళలు సంప్రదాయ దుస్తులను ధరించి కుటుంబ సమేతంగా పుట్టలో పాలు పోసి నాగదేవతను దర్శించుకున్నారు.
– సుభాష్‌నగర్



గాజులరామారం చిత్తారమ్మ ఆలయ ప్రాంగణంలోని నాగదేవత ఆలయం వద్ద..



షాపూర్‌నగర్ ప్రధాన రోడ్డులో..



సూరారం ఉమామహేశ్వర ఆలయం వద్ద భక్తులు

ఇందిరా గాంధీ విగ్రహ ఆవిష్కరణకు ఏర్పాట్లు

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట బస్టాప్ సమీపంలో జూన్ 18న టిప్పర్ డ్రైవర్ అజాగ్రత్త ఇందిరా గాంధీ విగ్రహం ధ్వంసమైంది. తిరిగి అదే చోట ఈనెల 25న విగ్రహ ఆవిష్కరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ విగ్రహ ఆవిష్కరణకు పలువురు ప్రజాప్రతినిధులు హాజరు కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



ఇందిరా గాంధీ విగ్రహ ఆవిష్కరణకు సిద్ధం చేస్తున్న దృశ్యం



జూన్ 18న టిప్పర్ ఢీకొట్టడంతో ధ్వంసమైన విగ్రహం (ఫైల్)

సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం దేశానికే దిక్సూచి



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశానికే దిక్సూచిగా మారిందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సోమవారం చింతల్‌లోని పార్టీ కార్యాలయంలో వివిధ పథకాల కింద మంజూరైన రూ.2.కోట్ల 95 లక్షల విలువ చేసే చెక్కులను 295 మంది లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కులవృత్తులను పరిరక్షించడానికి, నిరుద్యోగులు, మహిళలు, మైనార్టీలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు పథకాల ద్వారా రుణాలు అందజేస్తోందన్నారు.

◆ రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని పంచశీల కాలనీలో రూ.15.5 లక్షలు, గిరినగర్‌లో రూ.90లక్షల వ్యయంతో నూతనంగా చేపడుతున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను ఎమ్మెల్యే స్థానిక కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. డివిజన్ అధ్యక్షుడు ఏర్వ శంకరయ్య, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జయరామ్ తదితరులు ఉన్నారు.

◆ జగద్గిరిగుట్ట డివిజన్ జగద్గిరినగర్‌లో రూ.43 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు రుద్రా అశోక్, నాయకులు సయ్యద్ రషీద్, ఎత్తరి మారయ్య, వేణు యాదవ్, బాబుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కబ్జాదారులకు ధారాదత్తం

- బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్
- భారీ ర్యాలీగా వెళ్లి ప్రగతినగర్ డంపింగ్, గ్రేవ్‌యార్డ్‌ల పరిశీలన





ప్రగతినగర్‌లో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఈటల రాజేందర్

నిజాంపేట్: కేసీఆర్ ప్రభుత్వం ప్రభుత్వ భూములను కబ్జాదారులకు ధారదత్తం చేస్తోందని బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం ఆయన నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతినగర్ గ్రేవ్‌యార్డు, డంపింగ్‌యార్డులను మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, జిల్లా అధ్యక్షుడు హరీష్‌రెడ్డిలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ... శంషీగూడ సర్వే నంబర్ 57లోని 274 ఎకరాలు ప్రభుత్వ భూమిని కాస్రా, పహాని రికార్డులు చెబుతున్నా... కోర్టులో సరైన వాదనలు, కౌంటర్ ఫైల్ దాఖలు చేయకపోవడంలో ప్రభుత్వ అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. నేడు 92 ఎకరాల ప్రభుత్వ భూమి ప్రైవేట్ భూమిగా చెప్పుకోవడానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు.

ప్రైవేట్ పరం చేయడంలో ప్రభుత్వం పాత్ర..

◆ ఇప్పటి వరకు సుప్రీంకోర్టు గాని.. హైకోర్టు గాని.. దేశ్‌పాండే, నిర్మల దేవికి ప్రభుత్వ భూమిని కట్టబెడుతూ ఉత్తర్వులు గాని.. ఫైనల్ డిగ్రీ గాని ఇచ్చిన దాఖలు లేవని.. పైగా సుప్రీంకోర్టు ఆర్డర్‌ను సాకుగా చూపిస్తూ సర్వే నం.57లోని శంషీగూడలో ప్రభుత్వ భూమి లేకపోవడంతో ప్రగతి నగర్ డంపింగ్‌యార్డ్ స్థలాన్ని, గాజులరామారం పరిధిలోని రూ.5వేల కోట్ల విలువ చేసే 92 ఎకరాల ప్రభుత్వ భూమిని కూకట్‌పల్లి ఎమ్మార్వో రిజిస్ట్రేషన్ చేసి ప్రైవేట్ పరం చేయడంలో కేసీఆర్ ప్రభుత్వం పాత్ర ఉందనేది స్పష్టమవుతుందన్నారు.

ప్రభుత్వ భూములను పరిరక్షిస్తామని అధికారంలోకి వచ్చి..

◆ అదేవిధంగా 92 ఎకరాల ప్రభుత్వ భూమిని కూకట్‌పల్లి రెవెన్యూ అధికారి (గోవర్ధన్) ప్రైవేటు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేశారన్నారు. దాదాపు 130 ఎకరాల వరకు కబ్జా పెట్టడం కాకుండా ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణ పనులు సజావుగా సాగేలా చేశారన్నారు. అనుమతులు లేకుండానే ఎక్సెల్ల ప్రాపర్టీ ప్లాట్ల అమ్మకాలు చేపడుతున్నా రెవెన్యూ మున్సిపల్ అధికారులు ఎందుకు సహకరిస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వ భూములను పరిరక్షిస్తామని చెప్పి కేసీఆర్ తీరా అధికారంలోకి వచ్చాకా రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ధారాదత్తం చేస్తున్నారని ఆరోపించారు.

రియల్‌ఎస్టేట్ బ్రోకర్లతో లాలూచీ..

◆ దేశ్ పాండే, నిర్మలాదేవి లాంటి రియల్ ఎస్టేట్ బ్రోకర్లతో లాలూచీపడి సుప్రీంకోర్టులో తప్పుడు తీర్పు రావడానికి ప్రత్యక్షంగా పరోక్షంగా సహకరించడమే కాకుండా.. మంత్రికి సంబంధం ఉన్న ఫీనిక్స్ కంపెనీకి దొడ్డిదారిన ఎక్సెల్లే ప్రాపర్టీస్‌కు డెవలప్‌మెంట్ నిమిత్తం ప్రభుత్వ స్థలాన్ని ఇప్పించడంలో బీఆర్‌ఎస్ పార్టీ పెద్దల పాత్ర ఉందన్నారు. అడ్డదారులు నిబంధనలకు విరుద్ధంగా కోర్టులో కేసులు పెండింగ్ ఉందని.. హైకోర్టు ఫైనల్ డిగ్రీ లేకపోయినా ప్రభుత్వ భూమిని దొడ్డిదారిన సర్వే చేసి దక్కించుకొని దర్జాగా అనుభవిస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.

ప్రభుత్వ భూమిని పరిరక్షించకుంటే సీబీఐకు ఫిర్యాదు చేస్తాం..

◆ కేసీఆర్ ప్రభుత్వం తక్షణమే ప్రజా ఆస్తులను తిరిగి స్వాధీనం చేసుకుని వాటిలో కూల్చివేతలు చేపట్టిన వారిపై పోలీస్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూమిని పరిరక్షించడానికి రీపిటిషన్ వేయాలన్నారు. ప్రభుత్వ భూమిని ప్రైవేట్ రియల్ ఎస్టేట్‌కు దొడ్డిదారిన రిజిస్ట్రేషన్ చేసిన కలెక్టర్, రెవెన్యూ, సీసీఎల్‌ఏ అధికారులపై చర్య తీసుకోవాలని లేని పక్షంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రజా ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోకుంటే త్వరలోనే సీబీఐకు ఫిర్యాదు చేస్తామని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు.

◆ ప్రగతినగర్ కమాన్ వద్ద మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ నేతలు, కార్యకర్తలు ఈటల రాజేందర్‌కు స్వాగతం పలికారు. భారీ బైక్ ర్యాలీగా ప్రగతినగర్ డంపింగ్‌యార్డ్, గ్రేవ్‌యార్డ్‌లకు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కొల్లి మాధవి, సీనియర్ నాయకుడు కూన శ్రీనివాస్ గౌడ్, నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు ఆకుల సతీష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్, అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు గిరివర్ధన్ రెడ్డి, విగ్నేశ్వర్, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎంఎస్ వాసు, జిల్లా ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, కార్పొరేషన్, మండల, జిల్లా, రాష్ట్ర సాయి నాయకులు తదితరులు పాల్గొన్నారు.